# స్పర్శ

"నిన్ను తాకాలనిపిస్తోంది. దగ్గరకు తీసుకోవాలన్పిస్తోంది. నీ భుజం మీద చెయ్యి వేసి నడవాలన్పిస్తోంది."

వంశీ మాటలు గుర్తొచ్చినప్పుడల్లా ఉలిక్కిపడుతోంది మాలతి. పదిహేనేళ్ల ప్రాణస్నేహం తర్వాత ఈ మాటలు.

మాలతికి ఎప్పుడూ అలా అనిపించలేదు. ఆ మాటకొస్తే వంశీకీ అనిపించలేదు. కానీ, వారం రోజుల నుంచీ అతని ముఖంలో దిగులు. ఏదో అమూల్యమైనది పొందలేక పోయానన్న దిగులు. కళ్లల్లో వేదన. మళ్లీ మళ్లీ ఈ మాటలే ఆర్తిగా పలుకుతున్న అతని కంఠం. మాలతికి దీన్నుంచి ఎలా బైటపడాలో, అతన్నెలా బైటికి లాగాలో అర్థం కావటం లేదు.

అసలిదంతా ఆ ప్రభ మూలాన మొదలైంది. ప్రభ తన ఇంటికి రాకపోతే, ఇద్దరూ కలిసి వంశీ స్టూడియోకి వెళ్లి ఫొటో దిగి ఆ తర్వాత ముగ్గురూ కలిసి రెస్టారెంట్‌కి వెళ్లకపోతే ఈ సమస్య వచ్చి ఉండేది కాదనిపించింది మాలతికి.

ప్రభ తీరే వేరు. చిన్నప్పటి నుంచీ అంతే. ఆడా, మగా తేడా చూడదు. ఎవరితో నయినా భుజం మీద చెయ్యివేసిగానీ మాట్లాడదు. అవతలి వ్యక్తి నచ్చితే మాట్లాడుతూ మాట్లాడుతూ చెయ్యి పట్టుకుని ఇక వదలదు. ఆ చెయ్యి సందర్భాన్ని బట్టీ అతని వీపుమీద తడుతుంది. తలమీద కొడుతుంది. మొత్తానికి మనిషి నచ్చాడంటే ఇక అతి సన్నిహితంగా, ఆడ స్నేహితులతో ఎట్లా ఉంటామో అట్లాగే ఉంటుంది. ఇవాళా, రేపూ ఒక వయసొచ్చాక ఆడ స్నేహితుల మధ్య కూడా పెద్దగా స్పర్శ ఉండటం లేదు. అసలీ ఉద్యోగాలలో, పిల్లల చదువుల్లో, ఇంటి చాకిరీల్లో అంత చనువుగా మెసిలే వీలేదీ?

భుజాలమీద చేతులు వేసుకుని, చేయీచేయీ పట్టుకుని, ఒకరి ఒళ్లో ఒకరు తలపెట్టుకుని, సంతోషం, బాధా ఏదైనా కావలించుకుని కలబోసుకునే ఆ సమయం ఏదీ?

భర్తకూ, పిల్లలకే ఈ చేతులూ, భుజాలూ చాలటం లేదు. ఇక స్నేహితులకు సమయమే కాదు, చోటు కూడా లేదు.

కానీ, ప్రభ పద్ధతి మారనే లేదు. స్నేహితుల చేతుల్తో ఆడుకోకుండా మాట్లాడనేలేదు. పదేళ్ల తర్వాత కలిసిందేమో ఇంట్లో తనతోపాటు ఎవరున్నారో కూడా చూడకుండా కావలించుకుంది. ఇక తన భుజం మీద చెయ్యి తియ్యనే లేదు. వంశీ అంతా ఆశ్చర్యంగా

చూశాడు. ప్రభ తమ స్నేహం గురించీ, కాలేజీ రోజుల గురించీ చెప్తుంటే అవి తనకు అంతకుముందు తెలిసిన విషయాలే అయినా ఆసక్తిగా విన్నాడు. తన స్టూడియోకి తీసికెళ్లి ఫొటో తీశాడు. రెస్టారెంట్‌లో ప్రభ సగం తన ఒళ్లోనే కూర్చుంది. రెస్టారెంట్‌కి వచ్చేసరికి ప్రభ వంశీ చేతులు పట్టుకుని మాలతిలాంటి స్నేహితురాలున్నందుకు అతన్ని అభినందించే దశకు వచ్చేసింది. ప్రభ సునామీలా వచ్చి తన మనశ్శాంతిని పట్టుకుపోయింది అనుకుంది మాలతి.

ఆ తర్వాతే వంశీలో ఈ ఆలోచనా, అలజడీ మొదలై ఉంటాయి...

మోహన్, అరవింద్‌లు హడావుడిగా రావటంతో మాలతి లేచి వాళ్లకు ఎదురు వెళ్లింది.

ఇద్దరి ముఖాలూ వెయ్యి ఓల్టుల బల్బుల్లా వెలిగిపోతున్నాయి. అరవింద్ ముఖం విచ్చిన అరవిందంలాగానే ఉంది.

"వైజాగ్‌లో ఫ్రీ సీటమ్మా" ఆనందపు ఆయాసం వాడి మాటల్లో. ఏదో ఒక మెడికల్ కాలేజీలో ఫ్రీ సీటు వస్తే చాలనుకున్నాడు. విశాఖపట్నంలో రావటమంటే అదొక పెద్ద విజయమే.

రెండేళ్ల అలసట, ఆతృత, ఆందోళన పోయి అరవింద్ హాయిగా నవ్వుతున్నాడు.

ఈ క్షణాల కోసం రెండేళ్లు ఇల్లంతా ఎంత సర్దుకుందో.

ఎన్ని కలహాలు, ఎన్ని రాజీలు, ఎన్ని ఓర్పులు, సహనాలు-

అరవింద్ చివరికి సాధించాడు. సాధనకు అది విషయమే కాదు, ఇంజనీరింగ్ సీటు ఎక్కడ కావాలంటే అక్కడ తెచ్చుకోగలదు.

ఒక్క సంవత్సరం ఆగాలంతే.

ఇద్దరు పిల్లల్ని ప్రయోజకుల్ని చేసిన తృప్తి తనకూ, మోహన్‌కు. ఆ సాయంత్రం నవ్వులతో, తియ్యని కబుర్లతో, తీపి పాయసాలతో రాత్రిగా మారింది.

రాత్రి మోహన్ మాలతిని పొగిడి, ముద్దు చేసి, ముద్దులాడి తనివి తీరాక నిద్రపోయాడు. మాలతికి కూడా నిద్రపట్టింది.

పది నిమిషాల్లో ఎవరో తలుపు తట్టి లేపినట్లయి లేచి కూర్చుంది.

వంశీ మాటలు మళ్లీ మనసులో చప్పుడు చేస్తున్నాయి.

ఏం కావాలి వంశీకి?

తాము ఈ అపార్ట్‌మెంట్‌లోకి వచ్చినప్పటి నుంచీ ఇప్పటి వరకూ వంశీ స్నేహం తనకో బలం, వరం.

నిజానికి వంశీ, మోహన్ స్నేహితుడు. డిగ్రీలో క్లాస్‌మేట్. మోహన్ బ్యాంకు ఆఫీసరుగా జీవితం మొదలెడితే వంశీ తనకు ఇష్టమైన ఫొటోగ్రఫీని వృత్తిగా చేసుకున్నాడు. ఈ అపార్ట్‌మెంట్ కింద షాపింగ్ కాంప్లెక్స్‌లో అతని స్టూడియో. దాంతో ఎప్పుడంటే అప్పుడు ఇంటికి వచ్చేవాడు. మోహన్ బ్యాంక్‌కీ, తను కాలేజీకి వెళ్లినా అతని దగ్గరొక కీ ఉంటుంది. మధ్యాహ్నాలు పడుకున్నా, క్యారియర్ పైకి తెచ్చుకుని భోజనం చేసినా, సాయంత్రం వచ్చి టీ పెట్టుకు తాగినా వంశీకి ఆ

ఇంట్లో ఎవరి అభ్యంతరమూ లేదు. పిల్లలు పెందలాడే ఇంటికొస్తే వంశీ దగ్గరుండే వారు. పిల్లలు చిన్నగా ఉన్నపుడు అతను పైకి వచ్చి పాలు కలిపి ఇచ్చేవాడు. పెద్దవాళ్లు దగ్గర లేరన్న కొరత లేకుండా వంశీ స్నేహం అరవింద్, సాధనలకు వరమైంది.

మాలతీవాళ్లొచ్చి చేరిన ఆరు నెలలకే వంశీ పెళ్లయింది. ఆమె హొమియోపతి డాక్టరు. వంశీ ఆనందంగా ఉన్నాడు. మాలతీ ఆనందంగానే ఉంది. చిన్న చిన్న అసంతృప్తులూ, అశాంతులూ ఇద్దరికీ ఉన్నాయి. అవి ఒకరితో ఒకరు చెప్పుకోవటం ఇద్దరికీ అలవాటయింది. వంశీ భార్య శాంతికి సాయంకాలమే ఎక్కువమంది రోగులు వస్తారు. వంశీ తన స్టూడియో అసిస్టెంట్లకు అప్పజెప్పి వెళ్లగలడుగానీ, శాంతి తొమ్మిదిలోపు ఇంటికి రాలేదు. పెళ్లయిన కొత్తలో ఒక సమస్య అయితే, పిల్లలు పుట్టాక మరొక సమస్య. శాంతి తననూ, పిల్లల్నీ కూడా పేషెంట్లలాగా చూస్తుందంటాడు వంశీ. అతనికి కాస్త భావుకత్వం ఎక్కువ. శాంతి ప్రాక్టికల్. ఇద్దరి స్వభావాలలోని తేడాల వల్ల అపుడపుడూ అశాంతి పడినా సర్దుకునేవారు.

మాలతి లెక్చరర్‌గా పనిచేస్తూ రీసెర్చి చేయటం మొదలుపెట్టినపుడు వంశీ, మాలతీలు మంచి స్నేహితులయ్యారు. మాలతి తెలుగు లెక్చరర్. ఆధునిక సాహిత్యంలో కొత్త ధోరణుల గురించి పరిశోధన చేయటానికి యూనివర్సిటీలో రిజిస్టర్ చేయించుకుంది. మూడేళ్లపాటు మాలతితోపాటు వంశీ కూడా ఆ పరిశోధనలో భాగమయ్యాడు. పుస్తకాలు సేకరించటం, ఇంటర్వ్యూలకు మాలతితోపాటు వెళ్లడం, పుస్తకాలు చదివి చర్చించటం అన్నిటిలో మాలతికి తోడుగా ఉన్నాడు. అతనికి ఆ విషయాల మీద ఆసక్తి ఉండటం మొదటి కారణమైతే, అతని వృత్తిలో అతని సమయం అతని చేతిలో ఉండటం రెండో కారణం. స్టూడియోను ఆధునికంగా చేయటం, మంచి అసిస్టెంట్లను పెట్టుకోవటంతో అతనికి ఆర్థికంగానూ బాగుండేది. సమయం గురించిన ఒత్తిడీ ఉండేది కాదు. సహజంగా స్నేహశీలి కాబట్టి మాలతికి స్నేహ ధర్మంగా చేయగలిగినదంతా చేశాడు. మోహన్ బ్యాంక్ మేనేజర్ కావటంతో పని ఒత్తిడి చాలా ఉండేది. పైగా అతనికి మాలతి పరిశోధన విషయం గురించి అంత ఆసక్తి కూడా లేదు.

ఈ మూడేళ్లలో మాలతీ, వంశీల స్నేహం గాఢమైంది. ఇద్దరూ ప్రతి చిన్న విషయమూ చెప్పుకునేవారు. ఐతే వాళ్ల ఆత్మీయ సంబంధం ఎవరికీ అభ్యంతరం కానంత మర్యాద పూర్వకంగా ఏర్పడింది. వాళ్లు ఫ్యామిలీ ఫ్రెండ్స్. మాలతి కొలీగ్స్‌లో చాలా మందికి వంశీ తెలుసు. అతను అప్పుడప్పుడూ కాలేజీకి రావటం, ఇద్దరూ కలిసి వెళ్లటం వాళ్లనలా స్నేహితులుగా చూడటం అందరికీ అలవాటైంది. మాలతికి వివాహ జీవితంలో అసంతృప్తులున్నాయిగానీ, అవి మనసు తొలిచేసేవీ, ప్రాణాంతకంగా మారేవీ కావు. మోహన్‌ని పెళ్లాడేనాటికి మాలతికి పద్దెనిమిది నిండాయి. మోహన్‌కి పాతికేళ్లు. మాలతి డిగ్రీ చదువుతుండేది. అందువల్లనేమో మోహన్, మాలతిని ఇప్పటికీ చిన్న పిల్లలాగానే చూస్తాడు. అలాగే ముద్దు చేస్తాడు. అంత తేలికగానూ తీసిపారేస్తాడు. పెళ్లయ్యాక మాలతి చదివిన చదువు, సంపాదించిన జ్ఞానం, చేసే ఉద్యోగం

ఇవేవీ మోహన్‌కు గుర్తుండవు. అమాయకంగా తన చేయి పట్టుకుని అగ్నిహోమం చుట్టూ ప్రదక్షిణ చేసిన మాలతే అతనికి భార్యంటే. ఆమెను కసురుకోవచ్చు. కోప్పడవచ్చు. ఎంతమాటైనా అని సారీ చెప్పొచ్చు. చాలా సంవత్సరాలపాటు మాలతికి కూడా అదేమంత అభ్యంతరంగా తోచలేదు. కానీ, పిల్లలు పెద్దవుతున్న కొద్దీ, వాళ్ల ఎదుట అతను తనమీద కస్సుమని లేవటం, ఏ మాటంటే ఆ మాట మాట్లాడటం, తేలికగా తీసిపారేయటం ఇవన్నీ ఆమెను కలతపెట్టాయి. అది మోహన్‌కు చెప్పినా అతను పట్టించుకోలేదు. అందువల్ల నాలుగు ఏళ్లుగా మాలతి పిల్లల ఎదుట అతనితో మాటలు కలపటం, పెంచటం మానేసింది. మానేసిందిగానీ, తనను తాను కంట్రోలు చేసుకోవాల్సి రావటం ఆమెకు బాధగానే ఉంది. ఆ బాధనామె ఎప్పటికప్పుడు వంశీకి పంచిపెడుతూ అతన్నించి ఓదార్పు పొందుతోంది. వంశీ మంచి శ్రోత. ఎదుటివాళ్లు చెప్పేది ఓపిగ్గా వింటాడు. తొందరపడి వ్యాఖ్యానాలు చేయడు.

"సరేలే బాధపడకు. అతన్తో చెప్పి చూడు. ఇదొక్కటీ ఎలాగో ఓర్చుకో".

ఇలాంటి మాటలు తప్ప మాలతి అశాంతిని రెచ్చగొట్టే మాటలతడెన్నడు మాట్లాడ లేదు.

అందుకే వంశీతో మాట్లాడితే మాలతికి పెద్ద బరువు దిగినట్లుండేది. సామాన్యంగా ఇలాంటి విషయాలను స్నేహితురాళ్లతో పంచుకోవటం పరిపాటి. మాలతికి మాత్రం స్నేహితుడు దొరికాడు. మాలతి గురించి మోహన్‌కి తెలియని విషయాలు కొన్నున్నాయిగానీ వంశీకి సమస్తం తెలుసు. "ఇది మోహన్‌కి తెలియదు" అంటూ చెప్పే మాలతిని వంశీ మొదట్లో వారించే ప్రయత్నం చేశాడు.

"చెప్పొచ్చుగా" అనేవాడు.

మాలతి "నీకు తెలియదు. మొగుడి దగ్గర భార్య ఆత్మగౌరవం కాపాడుకోవాలంటే కొన్ని విషయాలు చెప్పగూడదు. అసలే మా ఆయనకు నేనంటే అంత గౌరవం లేదు" అనేది.

ఆ విషయాలేవీ రహస్యాలు కాదు. తన తమ్ముళ్ల ప్రవర్తన, మరదళ్ల తీరు గురించీ, వాళ్లను తన భర్త చులకనగా చూడకుండా తనెలా కాపాడుకొస్తోందీ - ఇలాంటివి ఎక్కువ చెప్పేది. పుట్టింటిని భర్త దగ్గర చులకన చేసుకోవటం మాలతికిష్టం లేదు. వంశీ లేకపోతే ఎవరితో చెప్పేదో. కానీ, వంశీకి చెప్పుకోవటంలో ఆమెకే సంశయమూ లేదు. అది అచ్చమైన స్నేహం. పౌరుషాలకూ, పంతాలకూ, అసూయలకూ, ఆత్మగౌరవాలకూ అతీతమైన స్నేహం. మాలతి తన ఓటముల గురించీ, తను చేసిన పొరపాట్ల గురించీ, తన బలహీనతల గురించీ నిస్సంకోచంగా వంశీకి చెప్పుకునేది. మోహనయితే విమర్శించటమో, వెటకారం చేయడమో, మందలించటమో, కేకలేయటమో చేస్తాడు. వంశీ సహానుభూతితో వింటాడు. ఫరవాలేదులే కొంపలేం మునగవని కాస్త ధైర్యం చెప్తాడు. అదే వంశీకీ, మోహన్‌కీ ఉన్న తేడా. వంశీ స్థానంలో స్నేహితురాలున్నా అలాగే జరిగేదేమో. ఏమైనా వంశీ స్నేహం మాలతికి బలం. మాలతి స్నేహం వంశీకీ అంతే.

అంతా బాగుంది. ప్రశాంతంగా జరిగిపోతోంది. మరో ఆరు నెలల్లో నలభయ్యవ దశకంలో ప్రవేశించబోతున్న మాలతిని ప్రాణమిత్రుడనుకుంటున్న ఒక మగవాడు "నిన్ను దగ్గరకు తీసుకోవాలనిపిస్తోంది. తాకాలనిపిస్తోంది" అంటుంటే ఏం చెయ్యాలో తెలియక తల పట్టుకుంది.

మాలతి మీద చెయ్యేసి తనవైపు తిప్పుకున్నాడు మోహన్. అతనికి మరింత దగ్గరగా జరిగి అతని స్పర్శలో తన ఆలోచనల్ని దూరం చేసుకుందామని ప్రయత్నించింది. కానీ, అవి ఆగలేదు.

ఇప్పటి మోహన్ స్పర్శ స్నేహ స్పర్శ మాత్రమే. ఇందులో మరింకే భావమూ లేదు. ఏదో ఆలోచిస్తూ మాలతి నిద్రపోవటం లేదని గమనించి ఆమె గురించి శ్రద్ధతో తనవైపు తిప్పుకున్నాడు. అతని చేయి తనమీద. అతని మెడకింద తన తల. వెచ్చగా, స్నేహంగా.

ఇలాంటి స్పర్శైనా వంశీ కావాలనేది? అది కుదురుతుందా? ఇప్పటి మోహన్ స్పర్శ స్నేహపు స్పర్శే. కానీ, అది ఏ క్షణంలోనైనా మోహపు స్పర్శగా మారవచ్చు. అప్పుడు తనకు సంతోషంగానే ఉండొచ్చు. ఒకోసారి చిరాకుగానూ ఉండొచ్చు. అతన్ని సమ్మతితోనూ, అసమ్మతితోనూ కూడా తను భరిస్తుంది.

కానీ, వంశీ కోరేదేమిటి? స్నేహం అంటున్న వంశీ స్పర్శ మోహావేశంతో నిండితే ఏం జరుగుతుంది? తనేం చేస్తుంది? ఏం చెయ్యాలి? తనకెందుకీ పరీక్ష?

అలా జరుగుతుందా? జరగకుండా ఉంటుందా? వంశీ దగ్గర కూడా అలా జరుగుతుందా? వంశీ తనను కేవలం ఆడదానిగా మాత్రమే చూసే క్షణాలు వస్తాయా? అది తను భరించగలదా? పర్యవసానాలేమిటి? ఏం పర్యవసానాలు? ఎందుకీ భయాలు? పదిహేనేళ్ల స్నేహం పట్టుకుంటే భళ్లున గాజుబొమ్మలా పగిలి పోతుందా? అలా పగిలే స్నేహం నిలవాలా? ఎందుకు?

మాలతి తల బద్దలవుతున్నది. ఆలోచనలు మొదలవ్వాలేగానీ వాటిని ఆపటం కష్టం. అటూఇటూ ఎడాపెడా ఇష్టం వచ్చినట్లు కొట్టి కొట్టి వెళ్తుంటాయి.

ఇలా జరుగుతుందనే ఆలోచన వంశీకి రాలేదా? లేక అతనదే కావాలనుకుంటున్నాడా? లేకపోతే ఏమిటా మాటలు? తాకాలనటం, భుజాలమీద చేతులు వేయాలనటం. ఆ మాటల్లోనే అంత వికృతముందా? ఎందుకా మాటలు తననింత కల్లోలపరచాలి?

అతనట్లా అనగానే ఔనా అంటూ అతని చేతిని పట్టుకుంటే ఏమయ్యేది?

ఏమైనా ఐతే... ఐతే... ఐతే.

మాలతికి గట్టిగా అరవాలనిపించింది. మోహన్‌కి దూరంగా జరిగి గట్టిగా కళ్లు మూసుకుంది.

* * *

మర్నాడు కాలేజీకి వెళ్లాలనిపించలేదు. మోహన్‌ని కూడా సెలవు పెట్టమంది. అరవింద్‌తో కలిసి సాధన ఉండే రెసిడెన్షియల్ కాలేజీకి వెళ్దామంది. వంశీ వచ్చే సమయానికి ఇంట్లో ఉండగూడదనిపించింది. కాలేజీకి వెళ్తే అక్కడికి వంశీ తప్పకుండా వస్తాడు. అతన్ని చూడకూడదని వాళ అనుకుంది. కానీ, వంశీకి చెప్పకుండా ఎక్కడికీ వెళ్లటం కూడా అలవాటు లేదు. వంశీకి

ఫోన్ చేస్తుంటే ఎన్నడూ లేని సంశయం, మనసులో దుడుకు. 'ఒక్క మాటతో ఎంత దూరం పెంచాడు!' అనుకుంది మాలతి. ఫోన్‌లో వంశీ గొంతులో ఎలాంటి మార్పు లేదు. అరవింద్ సీటు సంగతి చెప్పగానే అతను సంతోషంతో పొంగిపోయాడు. అరవింద్‌కి ఫోన్ ఇవ్వమని అతనితో పది నిమిషాలు, మోహన్‌తో ఐదు నిమిషాలూ మాట్లాడాడు. అదంతా ముగిసి మళ్లీ తను కూడా మాట్లాడి ఫోన్ పెట్టేసరికి మాలతికి బరువంతా దిగిపోయినట్లని పించింది. ఏదో పిచ్చి ఊహలు చేశాడు. తనలాగే అతనూ దీని గురించి ఆందోళనపడి ఉంటాడు. రాత్రంతా జాగారం చేసి ఉంటాడు. మనిషన్నాక ఎన్నో ఆలోచనలు వస్తుంటాయి. వచ్చిన ఆలోచన నిజాయితీగా చెప్పాడు. అది లోపల పెట్టుకుని ఇంకేవో పిచ్చి చేష్టలు చెయ్యలేదు. అందుకే వంశీ అంటే తనకిష్టం. గౌరవం. ఆ గౌరవం చెడగొట్టే పని వంశీ చెయ్యడు.

పంజరంలోని పక్షిని తీసి పైకెగరేసిన అనుభూతి మాలతి మనసంతా నిండి పోయింది.

ఆ రోజంతా పిల్లలిద్దరితో, మోహన్‌తో కాలం తెలియకుండా గడిచిపోయింది. మధ్యమధ్యలో వంశీ కూడా వస్తే బాగుండేది కదూ అంటూనే ఉంది భర్తతో.

మర్నాడు ఎప్పటిలా కాలేజీకి వెళ్లింది మాలతి. మొదటి గంటలో క్లాసు లేదు. డిపార్ట్‌మెంట్‌లో ఎవరూ లేరు. క్లాసులకో, లైబ్రరీకో, క్యాంటీన్‌కో వెళ్లారు. మాలతి పుస్తకం తీసి, తర్వాతి క్లాస్‌లో చెప్పాల్సిన పాఠం చూసుకుంటోంది.

హఠాత్తుగా ఉలిక్కిపడి లేచింది.

"ఎందుకంత భయపడతావ్?" వంశీ నవ్వుతున్నాడు.

అతని చెయ్యి మాలతి కుడి భుజం నుంచి ఎడమ భుజం వరకూ సాచుకుని ఉంది.

"ఏంటి వంశీ ఇది. ఎవరైనా చూస్తే" ఆందోళన, అశాంతి మళ్లీ మాలతి మనసు నిండా.

"ఎవరూ లేరుగా" మరింత దగ్గరగా రాబోయాడు.

"వంశీ ఇది పద్ధతి కాదు. ఇంకెప్పుడూ అలా చెయ్యకు. వెళ్లలా కూర్చో" అంది మాలతి కఠినంగా.

వంశీ వెళ్లి కూర్చున్నాడు.

అతని ముఖంలో నవ్వు ఆరిపోయి మళ్లీ దిగులు.

"అసలేంటి నీ ఉద్దేశం చెప్పు" మాలతికి గొంతు నిండా అశాంతి, దుఃఖం.

"చెప్పానుగా."

"ఏం చెప్పావు. అర్థంలేని మాటలు."

"చాలా అర్థం ఉందనిపించే చెప్పాను."

"అదేమిటో నాకు అర్థంకాక అయోమయంగా ఉంది."

"అంత అర్థం కానిదేముంది?"

టేబుల్ మీద ఉన్న మాలతి చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

"మా అమ్మాయి తన స్నేహితుల్తో ఇలా చేతులు పట్టుకునే మాట్లాడుతుంది."

"మన వయసు వేరు. మన తరం వేరు."

"వాటిని దాటలేమా?"

"ఈ విషయంలోనే దాటాలా? ఇది తప్పు తరాల భేదాన్ని దాటటానికి నీకింకేం కనిపించలేదా?" కటువుగా అడిగింది మాలతి.

"ఏమో – కానీ నీకు దగ్గరగా ఉండాలనీ, నీ స్పర్శ కావాలనీ నా లోపల్నించి కోరిక పుట్టుకొస్తోంది. నాకన్నీ తెలుసు. సమస్యలు, కుటుంబాలు, పరువు ప్రతిష్ట అన్నీ కదులుతాయి. బీటలు పడతాయి. ఐనా నేనా కోరికను కంట్రోలు చెయ్యలేక పోతున్నాను."

ఇంతలో గంట మోగింది. మాలతి పుస్తకాలు తీసుకుని,

"నాకు క్లాసుంది. దయచేసి నువ్వు స్టూడియోకి వెళ్లి పనిచేసుకో" అంటూనే బైటికి నడిచింది.

ఆ తర్వాత రెండు రోజులు సెలవు పెట్టి ఇంటికెళ్లిపోయింది.

రెండు రోజుల సెలవు ముందు అనుకున్నదే. అరవింద్, మోహన్‌లు రెండు రోజుల్లో విశాఖ వెళ్తారు. వాళ్లకు కావలసినవన్నీ సర్దాలి. అరవింద్ బట్టలు సర్దాలి. కావలసినవి కొనాలి. రవ్వలడ్డూలు, కారం బూందీ చెయ్యాలి. అన్నిటికన్నా వాడితో రెండ్రోజులు తీరిగ్గా కాలక్షేపం చెయ్యాలి. మాలతి తన మనసును వంశీవైపు వెళ్లకుండా కాపాడుకోవాలని గట్టిగా అనుకుంది.

ఆ రెండు రోజులూ వంశీ కూడా రాలేదు.

రెండో రోజు సాయంత్రం అరవింద్ బట్టలు సర్దుకుంటుంటే సహాయం చేస్తోంది. వంశీ వచ్చాడు.

'మాలతీ' అన్న పిలుపు వినగానే రెండ్రోజుల్నించీ లేని బరువు మళ్లీ మీదపడింది.

"వంశీ అంకుల్ వచ్చారు పదరా" అని అరవింద్‌ని తీసుకుని హాల్లోకి వచ్చింది.

కబుర్లూ, నవ్వులూ అన్నీ మామూలే.

అరవింద్ ఏదో పని ఉందని లోపలికి వెళ్లాడు.

"నేనీ బాధ భరించలేను. స్టూడియో రవిని చూసుకోమని ఎటన్నా వెళ్లిపోతాను" అన్నాడు మాలతి చెయ్యి పట్టుకుంటూ.

"వంశీ నీకు పిచ్చెక్కింది. శాంతినీ, పిల్లల్నీ ఒదిలి ఎటు వెళ్తావు? ఎందుకెళ్లాలి?"

"మరేం చెయ్యను?" వంశీ కళ్లల్లో నీళ్లు. ఏడుస్తున్నాడు.

మాలతికి కూడా దుఃఖం పొంగుకొచ్చింది. కంట్రోలు చేసుకుంటూ "వంశీ, ఆలోచిద్దాం. రేపు ఉదయం అరవింద్, మోహన్ వైజాగ్ వెళ్తున్నారు. నాకు క్షణం తీరిక లేదు. రేపు స్థిమితంగా కూచుని ఆలోచిద్దాం."

"ఆలోచిస్తావా? నువ్వా మాట అంటే చాలు".

అతని కళ్లలో ఎక్కడా లేని వెలుగు – ముఖమంతా సంతోషం.

అతని చెంపలు తాకాలనిపించి ఆ ఆలోచనకే భయంతో ఒణికింది మాలతి.

తనలో కూడా అలాంటి ఊహలే వస్తున్నాయా? ఇదెక్కడికి దారితీస్తుంది? జీవితంలో అంతా సెటిల్ అవుతున్న దశలో తనకీ పరీక్షలేమిటి?

రెండు రోజుల్నించీ ఏ పని చేస్తున్నా వంశీ దీనమైన ముఖం తనను వెన్నంటి వస్తూనే ఉంది. అతని మీద జాలి. ఆ జాలితో తనలో తనకేం జరుగుతోంది? తన మనసుకేమ వుతుంది?

అరవింద్ లోపల్నించి రావటంతో మళ్లీ మాటలు మొదలయ్యాయి.

అరవింద్ ర్యాగింగ్‌తో ఎలా తిప్పలు పడతాడో ఊహించి, నవ్విస్తూ, ఏడ్పిస్తూ మాట్లాడుతున్నాడు వంశీ.

* * *

ఉదయాన్నే ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు మోహన్, అరవింద్‌లు వెళ్లారు. ఇంటర్ రెండేళ్లూ ఇంటికి దూరంగా ఉండటం అలవాటైనా బయల్దేరే సమయానికి అరవింద్ బిక్కముఖం పెట్టాడు. మాలతి ఏడుస్తుంటే మోహన్ ఇద్దర్నీ తిట్టి, "సాధనను అత్తగారింటికి పంపేటప్పుడు ఏడుద్దువుగానిలే – ఇప్పుడాపు. ఏ పని ఎప్పుడు చెయ్యాలో ఎన్నేళ్లొచ్చినా నీకు తెలిసి చావదు" అంటూ కేకలేశాడు.

తను కేవలం అరవింద్ కోసమే అంతలా ఏడవలేదని మాలతికి తెలుసు.

వాళ్లు వెళ్లాక వంశీకి ఫోన్ చేసింది.

"వంశీ. మనం ఒక గంటలో బయల్దేరి భద్రాచలం వెళ్దాం. కారు తీసుకుని రా. మనిద్దరమే. రెండు రోజులు రానని ఇంట్లో చెప్పిరా."

వంశీవైపు నుంచి నిశ్శబ్దం.

"నీకు కావలసినట్లు ఉందాం. నన్ను దగ్గరకు తీసుకుందువుగాని. భుజాల మీద చేతులు వేసి నడుద్దువుగానీ–"

ఫోన్ పెట్టేసి సూట్‌కేసులో రెండు జతల బట్టలు సర్దుకుని కూర్చుంది.

వంశీ వచ్చేస్తాడు. ఒక మొండితనం. ఒక పిరికితనం.

వంశీకి తన స్పర్శ కావాలి. ఆ స్పర్శ ఎలాంటిది? నాగుబాము పాకినట్లు ఉంటుందా? పూలహారం తాకినట్లు ఉంటుందా? వేడిని రగులుస్తుందా? గడ్డ కట్టిస్తుందా? అసలేమవుతుంది? ఇద్దరి మనసుల లోపలి పొరల అగాధాల్లో పదిహేనేళ్లగా పేరుకున్నదేమిటి?

స్త్రీ పురుషుల మధ్య స్నేహం అనివార్యంగా ఒకదారే పడుతుందా? ఇదంతా తేల్చుకోకపోతే తనకు శాంతిగా ఉండదు.

తేల్చుకుని తీరాలి –

వంశీ వచ్చి ఎదురుగా నుంచున్నాడు.

కార్లో వంశీ పక్కనే కూచుని అతని చేతిని తన చేతిలోకి తీసుకుని గట్టిగా నొక్కి "పోనివ్వు" అంది మాలతి.

వంశీ ఆ చేతిని వదలకుండా పట్టుకున్నాడు.

"నేనెక్కడికీ పోను. పద వెళ్దాం" మాలతికి భయం పోయింది.

వంశీ డ్రైవ్ చేస్తున్నాడు. మాలతి మాట్లాడుతోంది.

ఎప్పటెప్పటి కబుర్లో నవ్వుతూ చెబుతోంది. మధ్యలో అతని భుజం మీద చెయ్యి వేస్తోంది.

అతనూ ఆమె చేతినీ, భుజాన్నీ తట్టి మాట్లాడుతున్నాడు. క్యాసెట్లు మార్చేటప్పుడు తలలూ, చేతులూ తాకుతున్నాయి. మధ్యాహ్నం రెండింటికి భద్రాచలం చేరారు. వంశీ మంచి డ్రైవర్. హొటల్లో భోజనం చేసి అక్కడే గది తీసుకున్నారు.

"అబ్బా – నడుం నొప్పి" మంచం మీద పడిపోయింది మాలతి.

"ఔను లాంగ్ డ్రైవ్. కబుర్లలో తెలియలేదు కానీ" అతనూ ఆ మంచంమీద ఒక పక్క ఒరిగాడు. మాలతి కోసం చేయి సాచాడు. మాలతి అందించింది.

"నువ్వు నిజమైన స్నేహితురాలివి."

"అది మాత్రం తిరుగులేని సత్యం – నిద్రొస్తోంది. కాసేపు పడుకుందాం. రాత్రి మోహన్ నిద్ర పోనివ్వలేదు" నవ్వింది మాలతి.

"అలాగే" అని వంశీ కూడా కళ్లు మూసుకున్నాడు.

ఏదో తెలియని నిశ్చింతతోపాటు నిద్ర కూడా ఆవహించింది మాలతిని. మళ్లీ మెలకువ వచ్చే సమయానికి తన దగ్గరగా గాఢనిద్రలో ఉన్న వంశీ కనిపించేసరికి ఒక్క క్షణం అయోమయంగా అనిపించింది.

తేరుకుని టైము చూస్తే ఐదున్నరవుతోంది.

వంశీని లేపేసింది. "పద చీకటి పడకుండా గోదావరి ఒడ్డుకి వెళ్దాం."

గోదావరి ఒడ్డున ఒకరినానుకుని ఒకరు కూర్చున్నారు.

వంశీ చిన్నతనంలో తన ఈతగురించీ, స్నేహితుల మధ్య ఈతల పోటీల గురించీ చెబుతున్నాడు. నవ్వుతూ గోదావరిని చూస్తూ వింటోంది మాలతి.

నది ప్రవహిస్తూ ఉంది. నిత్యం నదిలో నీరు మారుతూనే ఉంటుంది. కానీ, మార్పేమీ లేనట్లే ఉంటుంది. స్త్రీ పురుష సంబంధాలలాగే మారుతూనే ఉన్నాయి. కానీ, మారినట్లు కనిపించటమూ లేదు. రాత్రి హొటల్ గదిలో టి.వి. చూస్తూ, పాత సినిమాల కబుర్లు చెప్పుకుంటూ ఉండగా మధ్యలో వంశీ హఠాత్తుగా అడిగాడు.

"భయంగా ఉందా?"

"ఇప్పుడా ఆ ప్రశ్న అడుగుతున్నావు? భయం ఉంది. లేదు. రాలేనంతగా భయం లేదు. గాబట్టే వచ్చాను. ఈ ప్రయాణం నా నిర్ణయమని మర్చిపోయావా?"

"నాకు చాలా భయం వేసింది మాలతి. ఒకవైపు నీతో సాన్నిహిత్యాన్ని కోరే మనసు. మళ్లీ మన స్నేహం ఎక్కడ పాడవుతుందోననే భయం."

"నువ్వా భయపడ్డావా?" పరిశీలనగా చూసింది వంశీ వంక.

"భయపడనా? నేను అనుచితంగా ప్రవర్తిస్తానని నువ్వనుకుంటే? స్త్రీ, పురుషులనే తేడాలు మర్చిపోయి స్నేహం చెయ్యలేమా? అనే సవాలు నన్ను పట్టి పీడించింది."

"మగాళ్లనీ సవాళ్లు ఎందుకిలా పట్టి పీడిస్తాయి?" కాస్త కోపం వచ్చింది మాలతికి.

"అంటే-"

"మగాడినని రుజువు చేసుకోవాలనీ, స్నేహితుడినని రుజువు చేసుకోవాలనీ, అది సాధిస్తాను, ఇది సాధిస్తాను - అలా నిరూపించుకోవాలనీ - ఇలాంటివి లేకుండా ప్రశాంతంగా జీవితం గడపలేరా? సరే - మీరేదో సాధించుకోండి. కానీ, దాంట్లో ఆడవాళ్లనెంత ఇబ్బంది పెడుతున్నారో ఆలోచించుకోండి."

కఠినమైన ఆ మాటలకు వంశీ ముఖం పాలిపోయింది.

"నువ్వు గెల్చావు. కానీ, నీలో ఆలోచన మొదలైన దగ్గర్నించీ నేనెంత హింస పడ్డానో నువ్వు ఊహించలేవు. ఎంత సున్నితమైన విషయం! చుట్టూ ఎలాంటి సమాజం. ఎలాంటి మనుషులు. నిజానికి ఉన్న పరిస్థితుల్లో మన చుట్టూ ఉన్న మనుషులంతా బాగానే ఉన్నారు. మన స్నేహాన్ని ఎప్పుడూ ఎవరూ అగౌరవపరచలేదు. అవమానించలేదు. కానీ, నీకు తృప్తి లేదు."

"ఎందుకు ఇద్దరు పురుషుల్లా, ఇద్దరు స్త్రీలలా స్త్రీ పురుషులు సన్నిహితంగా, దగ్గరగా స్నేహం చేయకూడదు? మనసులు దగ్గరైనంతగా శరీరాలు దగ్గరైతే అంతా తల్లకిందు లెందుకవ్వాలి?"

చిన్న పిల్లాడిలా ఉక్రోషంగా అడుగుతున్న వంశీని చూస్తే మాలతి కోపం తగ్గింది.

"చెయ్యొచ్చు. చేస్తారు. అది ప్రతి తరానికీ మారుతోంది. మా అమ్మమ్మ బంధువులైన మగాళ్లతో కూడా ఎదుట నిలబడి మాట్లాడేది కాదు. తలుపు వెనకో, కర్టెన్ వెనకో నుంచుని అత్యవసరమైతేనే మాట్లాడేది. మా అమ్మ తన చదువు సంగతి చాలాసార్లు చెప్తుంటుంది. ఆమె పెద్ద చదువులేం చదవలేదు. పదో తరగతిదాకా బడికి వెళ్లింది. అప్పట్లో ఆ పల్లెటూళ్లో బళ్లోకి ఇద్దరే ఆడపిల్లలు వెళ్లేవాళ్లట. మా అమ్మ, మా మేనత్త. వాళ్లిద్దరూ బడికి వెళ్తుంటే ఇళ్లలోంచి ఆడవాళ్లు వీధి గుమ్మాల్లోకి వచ్చి వింతలాగా చూసేవారట. వీధుల్లో మగవాళ్లు సరేసరి. వీళ్లు బడికెళ్లి సరాసరి క్లాసులోకి వెళ్లటానికి వీల్లేదు. టీచర్ దగ్గరకు వెళ్లి టీచర్‌తోపాటు క్లాసులోకి వెళ్లి, ముందు వరుసలో బెంచీమీద కూర్చుని క్లాసవగానే టీచర్‌తోపాటు బైటికెళ్లేవారట. ఇంకో టీచర్ వస్తుంటే ఆయనతోపాటు మళ్లీ క్లాసులోకి వెళ్లేవారు. అంటే క్లాసులో టీచర్ లేని ఆ పది నిమిషాలు కూడా ఆడపిల్లలు మగపిల్లల మధ్య ఉండగూడదు. అంత భయం. అంత నిఘా.

నేను చదువుకునే సరికి ఆడపిల్లల స్కూళ్లు ప్రతి ఊళ్లోనూ వచ్చాయనుకో - మళ్లీ ఇప్పుడు కో- ఎడ్యుకేషన్ స్కూల్స్ -

రోజులెంత మారాయో చూడు.

మనకంటే మన పిల్లలు హాయిగా స్నేహాలు చేస్తారు. ఐతే మా అమ్మమ్మ నుంచీ రేపు మనవరాళ్ల వరకూ మారిన, మారుతున్న కాలంలో ఇలాంటి సంక్షోభాలూ, సంక్లిష్ట సందర్భాలు ఎందరు అనుభవించి ఉంటారో కదా-"

"ఔను" నీరసంగా అన్నాడు వంశీ. అతనికిప్పుడిప్పుడే మాలతి ఎంత వేదన అనుభవించి ఉంటుందో అన్న ఆలోచన కలిగింది. మాలతికి ఆవేశం ఆగలేదు. ఆమె కళ్లముందు స్నేహాలు, ప్రేమలు, వీటి పేరుతో అల్లకల్లోలమైన స్త్రీలు కదులుతున్నారు. హత్యలు, ఆత్మహత్యలు, బహిష్కరణలు, వెలి, అవమానాలూ - ఎన్ని - స్త్రీ పురుషుల స్నేహం గురించిన అనుమానాలలో ఎంత హింస.

"ఈ సంక్షోభాలు కొందరు దాటగలిగి ఉంటారు. కొందరు దాటలేకపోయి ఉంటారు. కొందరు అవమానాలతో ఆగితే, కొందరు ప్రాణత్యాగమే చేయాల్సి వచ్చేది. ఎంత అల్పమైన విషయాల కోసం ప్రాణాలిచ్చారో ఆడవాళ్లు. అలా ఎందరో సాహసాలు చేస్తే తప్ప తర్వాత తరపు అడుగు ముందుకు పడలేదు."

"ఎందుకు స్త్రీ పురుషుల మధ్య స్పర్శ అంత నిషేధం కావాలి." అన్నీ తెలిసి, ఏమీ తెలియని పరిస్థితిలో పడిన వంశీ ముఖం చూస్తే మళ్లీ జాలేసింది మాలతికి.

"నేను చిన్నప్పుడు మా మామయ్య ఒళ్లోనో, భుజం మీదనో తప్ప కూర్చునేదాన్ని కాదు. ఆయనకూ, నాకూ పాతికేళ్ల వయోభేదం. ఆయనకు నేనంటే ప్రాణం. కానీ, నా పదమూడో ఏట ఆయన స్పర్శ నాకు దూరమైంది. ఎప్పుడన్నా తల నిమిరి ఊరుకునే వాడు. ఎవరి మనసులోనూ వేరే రకమైన ఆలోచన లేదు. నాకెవరూ మామయ్యతో అంత చనువుగా ఉండొద్దని చెప్పిన గుర్తూ లేదు. కానీ, చెప్పకుండానే చెప్పే పద్ధతులెన్నో ఉంటాయి.

మామయ్య స్పర్శ దూరమైంది. నాన్నతో, చివరకు తమ్ముళ్లతో కూడా క్రమంగా ఎడం పెరిగింది.

కొత్త స్పర్శలు - భర్తతో - పిల్లలతో -

దీని వెనకాల చాలా చాలా ఉంది. తరాలు పడుతుంది, స్పర్శ సుఖంతో స్నేహంలో స్త్రీ పురుషులు సేదదీరటానికి."

వంశీ ముఖంలో బాధా, దిగులు మళ్లీ కమ్ముకున్నాయి.

"నిన్ను చాలా బాధపెట్టాను, క్షమించు".

మాలతి చిత్రంగా నవ్వింది.

"లేదు వంశీ. ఆ బాధ, ఆ పరీక్షా అవసరమే. ఇవాళంతా నీ సామీప్యాన్ని, స్పర్శనూ హాయిగా అనుభవించాను. ఒక మంచి అనుభూతి, ఒకరకంగా గర్వంగా కూడా ఉంది. ఏదో విశ్వాసం మనసు నిండా - మంచి నమ్మకం".

"ఒకవేళ నేను వేరేవిధంగా ప్రవర్తిస్తే, మన స్నేహం పాడైపోయేదేగా - మళ్లీ నా ముఖం చూసేదానివేనా?"

"అది ఆలోచించకుండానే ఈ ప్రయాణం తలపెట్టాననుకుంటున్నావా? ఇవ్వాళ నీ స్నేహం మోహంగా మారే అవకాశం ఉండొచ్చని నా ఆడమనసు నన్ను హెచ్చరించలేదను కున్నావా? అలా జరిగితే ఏం చెయ్యాలి?

చూద్దాం. నా ప్రాణ స్నేహితుడివి. నీకంటే ఎవరున్నారు? నీకంటే ఎక్కువేముంది? నీ స్నేహాన్ని ఒదులుకోవాల్సినంత ప్రాముఖ్యంగలదా ఆ మోహం. అది కొన్ని రోజులు, గంటలు, నిమిషాలలో చల్లారుతుంది.

నేనేం చిన్నపిల్లను కాదుగా. నలభై ఏళ్ల వయసు. జీవితానుభవం. వీటినుంచి నేనేం నేర్చుకోలేదనుకున్నావా?"

వంశీ కళ్లలో నీళ్లు తుడిచింది మాలతి.

"ఇది నేను ఛాలెంజ్‌గా తీసుకున్నాననుకున్నాను. కానీ, ఇది నీకెంత ఛాలెంజో నాకిప్పుడుగానీ అర్థం కాలేదు. నువ్వు మన స్నేహానికిచ్చిన విలువ - ఐయామ్ సారీ మాలతీ. నిన్నింత బాధపెట్టి ఉండగూడదు. ఐయామ్ సారీ - మనం ఒకళ్ల చేతులొకళ్లు పట్టుకుని నడిస్తే - అది మోహానో, శాంతో చూస్తే అంతా నాశనమయ్యే అవకాశం ఉందని నాకు తెలుసు. ఇన్నాళ్ల స్నేహం ఒక్కసారి బూడిద తప్ప ఏమీ మిగలని స్థితిలోకి వెళ్లే ప్రమాదం ఉందని కూడా తెలుసు. అనాగరికమైన మనుషులు మన స్నేహం మీద బురద చల్లుతారనీ తెలుసు. కానీ, నాకవేవీ అంత అడ్డంకి కాలేదు. అన్నిటికంటే పెద్ద బాధ నా గురించే. నేను అనుచితంగా ప్రవర్తిస్తే - ప్రవర్తిస్తానా? అది తెల్చుకోవాలనే నిన్నింత బాధ పెట్టాను."

"ఇక బాధ లేదు వంశీ. నాకు సంతోషంగా ఉంది. మన స్నేహంలో చాలా పెద్ద క్రైసిస్ - దాటాలనుకున్నాను. దాన్లో ఎన్ని కష్టాలొచ్చినా భరించి స్నేహాన్ని కాపాడుకుందామనుకున్నాను. కాపాడుకోగలిగాను."

వంశీ దుఃఖం పెరిగింది. చిన్న పిల్లాడిలా ఏడ్చేశాడు.

"పిచ్చాడా.. ఎందుకేడుస్తావు?"

మాలతి ఎంత సముదాయించినా చాలాసేపటికిగానీ వంశీ దుఃఖం ఆగలేదు. స్త్రీ పురుషత్వాలను జయించి మానవులుగా మారిన ఆ స్నేహ క్షణాలను సంపూర్ణంగా ఆస్వాదిస్తూ ఆ రాత్రి గడిపారు.

❄

విపుల, మార్చి 2006